ప్రజాశక్తి
శుక్రవారం 21 నవంబర్ 2025 5
అనంతపురం



23న జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఈ నెల 23వ తేదీ పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా గౌరవ సలహాదారు జి.మల్లికార్జున తెలిపారు. పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంబరాలకు జిల్లా వ్యాప్తంగా మండల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు పాల్గొంటారన్నారు. సైన్స్, శాస్త్రీయ ఆలోచనల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కల్పించడమే సంబరాల ఉద్దేశమని జిల్లా అధ్యక్షులు కెపి.చిత్తప్ప తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు, నాయకులు శాంతరాజు, మాంతేష్, రాజన్న, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాబా సన్నిధిలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

స్వాగతం పలికిన మంత్రులు, ప్రముఖులు



సత్యసాయి మహాసమాధి దర్శనానికి వెళుతున్న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

భగవాన్ శ్రీసత్య సాయి బాబా మహాసమాధిని కేంద్ర రహదారులు, రవాణా శాఖకు మంత్రి నితిన్ గడ్కరీ గురువారం దర్శించుకున్నారు. ముందుగా శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ తదితరులు కేంద్ర మంత్రికి సాదర స్వాగతం పలికారు. సాయికుల్వంత్ హాల్లో జరిగిన సభలో నితిన్‌గడ్కరీ మాట్లాడుతూ ప్రపంచానికి సేవా మార్గాన్ని నేర్పిన వ్యక్తి సత్యసాయిబాబా అని అన్నారు, ఆకలితో ఉన్న వ్యక్తికి తొలుత అన్నం పెట్టాలి గాని ఆధ్యాత్మికత బోధించరాదని సాయి అన్నారని చెప్పారు. తాను ఎవరినీ బోధించటానికి రాలేదని, ఇక్కడి భక్తి, విలువలు, సేవా భావాన్ని చూసి ఇంకా ఎక్కువ మంచి పని చేయడానికి ప్రేరణ పొందటానికే వచ్చానని నితిన్ గడ్కరీ తెలిపారు. మంచి విద్య, సత్సంగతి, సత్ప్రవర్తన ఇవే ఒక మనిషిని ఉత్తముడిగా తీర్చిదిద్దే మహత్తర గుణాలు అని అన్నారు. జీవితంలో శాంతి ఎంతో ముఖ్యమని, శాంతి ఉన్నచోట సమస్యలు సహజంగానే పరిష్కారాలు పొందుతాయని చెప్పారు. భవిష్యత్తుపై ఆందోళన పెంచుకుంటే అశాంతి పెరుగుతుందని గుర్తుచేశారు. విజ్ఞానాన్ని సాంకేతికత, ఆవిష్కరణల ద్వారా సంపదగా మార్చగలిగితేనే పేదరికాన్ని నిర్మూలించవచ్చని వివరించారు.

కేంద్రమంత్రికి విమానాశ్రయంలో ఘన స్వాగతం : పుట్టపర్తి విమానాశ్రయంలో కేంద్ర జాతీయ రహదారులు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి పుట్టపర్తి విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్ సవితమ్మ, సత్యకుమార్ , ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, బిజెపి నేత సోమ గుట్ట విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్,ట్రస్ట్ సభ్యులు కేంద్ర మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం నితిన్ గడ్కరీ ,రాష్ట్ర మంత్రులు జనార్ధన్ రెడ్డి ,కందులు దుర్గేష్ ,సత్యకుమార్ ,సవితమ్మ ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి ,పరిటాల సునీత ,ఎమ్మెస్ రాజు, బిజెపి నేత కేంద్ర నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ప్రశాంతి నిలయం సాయి కుల్వంత హాల్లో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీనివాస గెస్ట్ హౌస్ లో సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారులు ,రాష్ట్ర రహదారుల ప్రగతిపై రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవితమ్మ సత్యకుమార్ ఆర్ అండ్ బి అధికారులతో నితిన్‌గడ్కరీ సమీక్ష నిర్వహించారు. సత్యసాయి జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణం తోపాటు నూతన జాతీయ రహదారుల ఏర్పాటుపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వివరించారు. ఎమ్మెల్యేలు పరిటాల సునీత,ఎంఎస్ రాజు తమ నియోజకవర్గాల్లో రహదారుల పరిస్థితి పై కేంద్రమంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పుట్టపర్తి నుంచి బెంగళూరుకు బయలుదేరిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఐడిసి రాష్ట్ర డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, సామకోటి ఆదినారాయణ, టిడిపి నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, గంగాధర్ నాయుడు, సురేష్ చౌదరి , బీసీ గంగన్న, లాయర్ హరికృష్ణ జ్యోతి ప్రసాద్, సునీల్ వైట్ల, సూర్యనారాయణ, కళ్యాణ్ కుమార్ , నారాయణ, రామాంజి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న మంత్రులు, ప్రముఖులు

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేయాలి

కలెక్టర్‌కు రైతు సంఘం నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేసి వారి బ్యాంకు ఖాతాలో రూ.20 వేలు జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగారెడ్డి, బాల రంగయ్య, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, సుంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం నాయకులు కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం రూ.20 వేలు వెంటనే కౌలు రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం నూతన కౌలు చట్టం తెస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందన్నారు. పాత చట్టం దుర్మార్గమైనదని ఆ లోపాలను సవరిస్తామని తాము అధికారంలోకి రాగానే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. పాత చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తెస్తున్నామని అసెంబ్లీలో వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించారని తెలిపారనిప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటిన ముసాయిదా చట్టాన్ని అసెంబ్లీలో పెట్టి ఇంత వరకు ఆమోదించలేదని విమర్శించారు. ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాలలో ఉన్న దేవాలయ భూముల కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. పంటల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వ్యవసాయ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కౌలు రైతుల గుర్తింపునకు భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధన చేర్చటం వల్ల భూస్వాములు ఎక్కువ మంది సంతకం పెట్టి అనుమతులు ఇవ్వడానికి అంగీకరించడం లేదన్నారు. ఈ చట్టం ద్వారా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, కాబట్టి పాత చట్టాన్ని రద్దు చేసి భూ యజమాని అనుమతితో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు ఎలాంటి షరతులు లేకుండా గ్రామ పంచనామా ఆధారంగా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియాను అందజేయాలని డిమాండ్ చేశారు.

వైసిపి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా గురువారం వైసిపి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ కూడలిలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మెట్టు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ పేదలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో మాజీ సిఎం జగన్ వైద్య కళాశాలలు మంజూరు చేయిస్తే, కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతో ప్రయివేటీకరణ చేయడం తగదన్నారు. బహుళ జాతి సంస్థలకు కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను నామమాత్రపు ధరకు కట్టబెట్టడం, ప్రతి నెల వేల కోట్ల అప్పులు చేయడం చేతనైన సిఎం చంద్రబాబుకు పేదల కోసం వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం చేత కాలేదన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే జగన్ పిపిపిని రద్దు చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌని ఉపేంద్రరెడ్డి, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, పార్టీ చేనేత విభాగం కార్యదర్శులు శివ, నాగప్ప, కౌన్సిలర్లు గోవిందరాజులు, శారద, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు సన్మానం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

టిడిపి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శిగా పట్టణంలోని గ్యాస్ కృష్ణ నియమితులయ్యారు. దీంతో గురువారం కృష్ణ పట్టణంలోని కాలవ నివాసంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాల వ శ్రీనివాసులును మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. తనకు ఈ అవకాశం కల్పించిన కాలవ శ్రీనివాసులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలో టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని కృష్ణ తెలిపారు. ఆయన వెంట 22వ వార్డు ఇన్‌ఛార్జి సిమెంట్ శీన, తిప్పేస్వామి ఉన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికులపై కక్ష సాధింపు తగదు

సిఐటియు జిల్లా కోశాధికారి నాగమణి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సిఐటియు జిల్లా కోశాధికారి నాగమణి సూచించారు. కార్మికుల పట్ల కాంట్రాక్టర్, ఆయన సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై తాగునీటి కార్మికులు చేపట్టిన రిలేదీక్షలు గురువారం నాల్గో రోజుకు చేరుకున్నాయి. ఆమె వారిని సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎక్కడైనా కార్మికులకు వేతనాలు పెంచడం చూశాం కానీ ఇక్కడ తాగునీటి కార్మికుల వేతనాలు తగ్గిస్తున్నట్లు కాంట్రాక్టర్లు చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. అలాగే కార్మికులు ఇష్టమైతే పని చేయవచ్చు లేదంటే తప్పుకోవాలని గౌతమ్, కిరణ్ బెదిరింపులకు పాల్పడడం తగదన్నారు. ఖాళీ బాండ్లపై సంతకాలు చేయించుకోవడం బాధాకరమన్నారు. కాంట్రాక్టర్ అడపాల వెంట్రావుతో పాటు బెదిరిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవ చూపి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించే దాకా ఉద్యమాలు కొనసాగుతాయన్నారు. దీక్షా శిబిరంలో యూనియన్ కార్యదర్శి రాము, ఆర్గనైజర్ అశోక్, అల్లాబకాష్, ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రిలేదీక్షలో పాల్గొన్న శ్రీరామిరెడ్డి కార్మికులు, నాయకులు

గృహాల కోసం దరఖాస్తు చేసుకోండి : పభుత్వ విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గ పరిధిలో ఇల్లు లేని పేదలు ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత గ్రామ, వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. 2029 నాటికి ప్రతి నిరుపేద సొంతింటి కల నెరవేరుస్తామని తెలిపారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో గురువారం ఆయన రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో వేర్వేరుగా సమావే శం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటి కోసం నియోజకవర్గ వ్యాప్తంగా 7,518 మంది దరఖాస్తులు చేసుకున్నారని, అందులో ఇంటి స్థలాలు కలిగిన వారు 4,799 మంది కాగా, పట్టా రాని వారు 2,749 మంది ఉన్నారన్నారు. ఇంటి పట్టా, పొజిషన్ సర్టిఫికెట్స్ ఇవ్వాల్సిన వారందరితో కలిపి సుమారు 3వేల మందికి డిసెంబర్‌లో పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. అర్హులందరికీ దశల వారీగా ఇళ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఆర్థికేతర సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆర్డీవో ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు, తహశీల్దార్లు, గృహ నిర్మాణ సంస్థ అధికారులు పాల్గొన్నారు


పక్కా ప్రణాళికతో వి'ని'ధులు

'అనంత' తహశీల్దార్ కార్యాలయంలో అక్రమాలు
ఓ మాజీ సైనికుడికి రూ. 15లక్షల మేర కుచ్చు టోపీ
అక్రమమార్గంలో రికార్డుల సర్దుబాట్లు, దిద్దుబాట్లు
అక్రమార్కులపై చర్యలు శూన్యం

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం రూరల్ పరిధిలోని రెవెన్యూ ముఖ్య అధికారి తన విధి నిర్వహణలో పక్కా ప్రణాళికతో నిధులను సమాకూర్చుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. రూరల్ మండల పరిధిలోని చేస్తున్న భూ వ్యవహారాలు చూస్తే ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. వివాదంలో ఉండి కోర్టులను ఆశ్రయిస్తున్న భూ బాధితులకు మొండి చేయి చూపిస్తూ.. భూ బకాసురులకు లాభం చేకూరేటట్లు కోర్టుల పేరుతో కార్యాలయంలో లేని రికార్డులను సర్దుబాట్లు దిద్దుబాట్లు చేస్తూ అక్రమార్జనకు తెరలేపారన్న విమర్శలున్నాయి. దొడ్డి దారిలో రికార్డులు మాయంచేస్తూ... కోట్లకు పాడగేతుత్తున్నప్పటికి నిఘా ఉంచాల్సిన విజిలెన్స్, ఇంటెలిజెన్స్, అనిశ శాఖ అధికారులు పట్టించుకోవటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అనంతపురం రూరల్ మండల పరిధిలోని సోమలదొడ్డి, రాచానపల్లి, కొడిమి, కురుగుంట, కక్కలపల్లి, ఉప్పరపల్లి, ఆకుతోటపల్లి, కందుకూరు గ్రామాల్లో ఉన్న వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆయా గ్రామాలకు చెందిన అనేక సర్వే నెంబర్లలోని భూముల్లో వందల కొద్ది కోర్టు కేసులున్నాయి. కోర్టు కేసుల ఉన్న భూమికి సంబందించి తహశీల్దార్ కార్యాలయం నుంచే కోర్టుకు నివేదికలు పంపాల్సింది ఉంటుంది. ఈ నివేదికల తయారీలో ఆశాఖలోని కొందరు అధికారులు అక్రమార్జనకు తెరలేపారన్న ఆరోపణలున్నాయి. ఎక్కువ పైకం ముట్టజెప్పినవారికి సంబందించి రికార్డులను సర్దుబాట్లు దిద్దుబాట్లు చేసి నివేదికలకు వారికి అనుకూలంగా సిద్ధం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుత విధులు నిర్వహిస్తున్న అధికారి 2021 సంవత్సరంలో ఇక్కడే విధులు నిర్వహించిన సమయంలో అక్రమ మార్గంలో చేసిన భూ వ్యవహారాలు, అడ్వాన్స్‌ల రూపంలో తీసుకుని ఇంతవరకు చేయని వ్యవహారాలను ప్రస్తుతం చక్కబెడుతున్నట్లు సమాచారం. భూమి ధరలు ఎక్కువ పలుకుతున్న గ్రామాలకు తన బినామి గ్రామ రెవెన్యూ అధికారులకే అదనపు బాధ్యతలు అప్పగించి 'ఆన్ ఫిల్డ్ డ్యూటీ' చేస్తూ వివాదంలో ఉన్న భూమిలోనివ్యవహారాలు చక్కబెట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆయనకు ఓ గ్రామ రెవెన్యూ అధికారి బినామిగా వ్యవహరిస్తునట్లు సమాచారం. సంపాదిస్తున్న అక్రమార్జనలో ఓ రెవెన్యూ డివిజన్ అధికారికి 50శాతం ముడుపులు అందిస్తున్నట్లు బలమైన ఆరోపణలున్నాయి.



కోడిమి గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 128లోని 3.88 ఎకరాల భూమిని 1952 సంవత్సరంలో చిన్న మాసూద్ తండ్రి మాసూద్ పేరిట ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈ భూమికి సంబందించి 2012 సంవత్సరం సమయంలో పాట్లుగా రిజిస్ట్రేషన్లు జరిపేశారు. అయితే ఈ భూమి రెవెన్యూ రికార్డులో మిగులుభూమిగా ఉండటంతో 2021 సంవత్సరంలో అప్పటి అధికారి (ప్రస్తుత అధికారి) తమ సిబ్బంది ద్వారా ఒప్పందం కుదుర్చుకొని దళారుల నుంచి రూ.15లక్షలు తీసుకొని ఓ మాజీ సైనికుడి పేరుతో వ్యవసాయ పట్టాను 2005 సంవత్సరానికి సృష్టించి పథకం ప్రకారం కార్యాలయ రికార్డులను తారుమారు చేసి 1బి, అడంగల్లో నమోదు చేసేశారని సమాచారం. విషయం తెలుసుకున్న చిన్న మాసూద్ నుంచి భూమిని కొన్న సతీష్ కుమార్ రెడ్డి, సుబ్రమణ్యం రెవెన్యూ డివిజినల్ అధికారికి ఫిర్యాదు చేశారు. విషయం పైస్థాయి అధికారులకు పొక్కడంతో రెవెన్యూ డివిజినల్ అధికారి నివేదికల ప్రకారం ఆన్ లైన్ నుంచి తొలగించేశారు. ఈభూమి వివరాలపై సమాచార హక్కు చట్టం ద్వారా అడిగితే కార్యాలయంలో మాజీ సైనికుడి పేరు మీద ఉన్న రికార్డులు మాయమై 1952 అసైన్మెంట్ దారుల రికార్డులు దర్శన మిస్తున్నాయి. అలాగే కందుకూరు గ్రామ పొలంలోని సర్వేనెంబర్ 118/4లో ఉన్న 4.50 ఎకరాల భూమిలో గత కొన్ని సంవత్సరాలుగా అనిల్ కుమార్ రెడ్డి రైతు వ్యవసాయం చేసుకున్నాడు. అయితే ఆయనకు ఎటువంటి హక్కులేదని, ఎకరానికి రూ.5లక్షల ప్రకారం రూ.25లక్షలు తీసుకొని హుస్సేన్ భాష తండ్రి సాహెబ్ పేరు మీద రికార్డులు ఉన్నట్లు గ్రామ రెవెన్యూ అధికారి నివేదికల ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అదే విధంగా ఉప్పరపల్లి గ్రామ పొలం పరిధిలోని సర్వేనెంబర్ 117 లో ఉన్న 3 ఎకరాల మిగులుభూమి రికార్డులు ఉన్నప్పటికీ రూ. 16 లక్షలు తీసుకొని చక్కపెట్టేశారు. ఇటుకులపల్లి గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 376లో భూహక్కుదారుడైన వ్యక్తి మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులు భాగపరిష్కారాలు చేసుకున్నారు. ఈ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి వారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికి అధికారులు తమకు కాసులు ముట్టలేదని కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ రెవెన్యూ కార్యాలంలోని అధికారులపై ఇన్ని ఆరోపణలున్నప్పటికీ పై స్థాయి అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఇప్పటికైనా సంబందిత ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు స్పందించి ఈ అక్రమాల గుట్టు రట్టు చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్



ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కార్మికుల సంక్షేమాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా ఉపాధ్యక్షులు నాగలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు ఉన్న సంక్షేమ బోర్డును నిలుపుదల చేసి తీరని అన్యాయం చేసిందన్నారు. తాము అధికారంలోకి వస్తే వెంటనే భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని చెప్పి వారి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో కార్మికుల ఓట్లు కొల్లగొట్టిందన్నారు. గెలిచిన తర్వాత మాట మరిచారని, అధికారంలో కొచ్చి సంవత్సరంన్నర కాలమైనా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం గురించి పట్టించు కోకపోవడం దుర్మార్గమన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియుగా అనేక దఫాలుగా పోరాటాలు చేస్తున్న కూటమి ప్రభుత్వం కార్మికుల గురించి పట్టించుకోకుండా దున్నపోతు మీద వాన పడిన చందంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన ఒక శాతం సెస్సు రూ.3294 కోట్లు సంక్షేమ వెల్ఫేర్ బోర్డులో ఉన్నాయని అసెంబ్లీలో శాసనమండలిలో కార్మిక శాఖ మంత్రి అధికారికంగా ప్రకటించారని తెలిపారు. వైసిపి, తెలుగుదేశం ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమ నిధి నుండి ప్రభుత్వ పథకాలకు నిధులు మళ్లించి గతంలో రూ.1800 కోట్లు వినియోగించుకున్నాయని విమర్శించారు. ప్రస్తుతం కార్మిక సంక్షేమ బోర్డులో ఉన్న రూ.3294 కోట్లు కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టకుండా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు దారి మళ్లించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వం తన విధానం మార్చుకుని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా రూ.5 లక్షలు, సాధారణ మరణానికి రూ.2 లక్షలు, గర్భిణులకు ప్రసూతి వసతి కింద రూ.20 వేలు, కార్మికుని కూతురు పెళ్లికి రూ.20 వేలు, కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1214 మెమోను రద్దు చేయాలన్నారు. 50 సంవత్సరాలు పైబడిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ. 10 వేలు పింఛను ఇవ్వాలన్నారు. కార్మికులకు పనులు కల్పించి స్టీలు, సిమెంటు, బిల్డింగ్ రంగానికి ఉపయోగించే మెటీరియల్ ధరలు తగ్గించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లైములకు నిధులు విడుదల చేయాలని, కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, సిఐటియు నగర అధ్యక్షులు వెంకట నారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు ఎర్రిస్వామి, ఆటో యూనియన్ ఇర్ఫాన్, నాగేంద్ర, కళావతి, హనుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి-కుందుర్పి

స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం పంట కోత ప్రయోగంపై రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ మాట్లాడు తూ 7 రకాల పంటల్లో 14 పంటకోత ప్రయోగాలు నిర్వహించాలన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు ఉపయోగపడే సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. పంటకోత ప్రయోగాల నిర్వహణలో వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో సహాయ గుణాంక అధికారిణి నాగలక్ష్మి, ఎఇఒ కులశేఖర్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-కుందుర్పి

మహిళలు సహకార సంఘాల ద్వారా అభివృద్ధి సాధించాలని ఎపిఎం సర్దానప్ప సూచించారు. మహిళలకు గురువారం సహకార సంఘం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎపిఎం మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, రాజకీయ, తదితర అన్ని రంగాల్లో ఎదుగుతూ ప్రపంచ పురోగతి సాధించాలని సూచించారు. సహకార చట్టం గురించి అవగాహన కల్పించారు. సహకార జెండాలోనే రంగులు, ప్రార్థన గురించి వివరించారు. అనంతరం మండలంలోని అమ్మ మండల సమైక్య కార్యాలయంలో అభివృద్ధి, సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీసీలు, వివో ఏలు, ఆయాగ్రమ్మల వివో లీడర్స్, ఎస్ హెచ్ జి యాక్టివ్ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలు మరింత బలోపేతం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సిడిపిఒ లక్ష్మి ప్రసన్న, ఎంఇఒ విజయకుమారి తెలిపారు. పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం సిడిపిఒ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. సిడిపిఒ మాట్లాడు తూ పైలెట్ ప్రాజెక్టు కింద మండలాన్ని కో లోకేషన్‌లోకి తీసుకున్నారన్నారు. ఎంఇఒ విజయకుమారి మాట్లాడుతూ కో లోకేషన్‌లో భాగంగా అంగన్వాడీ కేంద్రాలను మరింత శక్తివంతంగా తయారు చేసేలా విద్యాశాఖతో కలిసి పని చేస్తామన్నారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలందరికీ బాలల హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు. బాల్య వివాహాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాలను సూపర్వైజర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రాధమ్మ, లక్ష్మీదేవి, సుధ, అరుణ, కాసింబీ, రామాంజనమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

పిల్లల హక్కుల సంరక్షణ అందరి బాధ్యత

జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన



మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పిల్లల హక్కులు పరిరక్షించి వారికి ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరికీ ఉందని జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన, డాక్టర్ సుమన అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో గురువారం అనంతపురంలోని ఎస్సీ హాస్టల్ గర్ల్స్-2లో యూనివర్సల్ చిల్డ్రన్స్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా యూనివర్సల్ చిల్డ్రన్స్ డే అసలు ఎలా మొదలైంది, ఇది ఎందుకు జరుపుకోవాలనే విషయాలను విపులంగా వివరించారు. వారి హక్కులను వారు సాధించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి చంద్రిక మాట్లాడుతూ అవగాహన సదస్సు నిర్వహించడానికి సహకరించిన హెచ్.డబ్ల్యుఓ కె.అనిత, ఏఎస్‌డబ్ల్యుఓ రాము నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామల, చంద్రిక, జిల్లా కోశాధికారి గీత, నగర అధ్యక్ష, కార్యదర్శులు శంషాద్, అశ్విని, సీనియర్ నాయకురాలు రామాంజినమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర కల్పిస్తాం : జెడిఎ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ప్రస్తుతం రైతులు పండించిన పత్తిపంటకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర కల్పించనున్నట్లు జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఉమామహేశ్వరమ్మ తెలిపారు. గురువారం పెద్దవడుగూరులోని రైతు సేవాకేంద్రంలో గురువారం పెద్దవడుగూరు, యాడికి, గుత్తి, పామిడి మండలాల పత్తిరైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తిపంటను రైతులు అధికంగా సాగు చేశారన్నారు. ఈనేపథ్యంలో ఆయా రైతుల వద్దకు దళారులు చేరి రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. వారి ఉచ్చులో రైతులు పడకుండా. నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే సరైన గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. తేమశాతం బట్టి పత్తిని కొనుగోలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దవడుగూరు, యాడికి, గుత్తి మండలాల వ్యవసాయ శాఖ అధికారులు మునికృష్ణ, మహబూబ్‌బాషా, ముస్తాక్‌అహమ్మద్, ఎఇఒ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



సర్వే వివరాలను తెలుసుకుంటున్న డాక్టర్ జయలక్ష్మి

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.జయలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే వివరాలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం కచ్చితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎంఒ నాగన్న, డిస్ట్రిక్ట్ సూపర్‌వైజర్ రమణ, టిబి డాట్ సూపర్‌వైజర్ మహేష్, వైద్యాధికారి శంకర్‌నాయక్, సిహెచ్‌ఒ గంగాధర్, పిహెచ్ ఎన్ గ్రేస్‌లత, పర్యవేక్షకులు నాగమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, స్టాఫ్‌నర్సు జయలలిత, ల్యాబ్ టెక్నీషియన్ తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

అనంతపురం : ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగం గా 3వరోజు గురువారం జెఎన్‌టియు ఒటిపిఆర్ఐ జాతీయ సేవా పథకం విభాగం వారు స్మార్ట్‌విజన్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం బుక్కరా యసముద్రం మండలంలోని రేకులకుంట గ్రామం లో కంటి వైద్య చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జెఎన్‌టియు ఒటిపిఆర్ఐ సంచాలకులు జివి సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, రేకులకుంట మండల ప్రజా పరిషత్ పాఠశాల ఛైర్మన్ అరుణ్‌కుమార్, ఒటిపి ఆర్ఐ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.లహరి, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది, 50 మంది ఒటిపిఆర్ఐ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ

గుత్తి : మాజీ కౌన్సిలర్, 17వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఎస్ఎం.బాషా సతీమణి షేక్ ఫర్వీన్‌భానును టిడిపి నాయకులు గురువారం పరామర్శించారు. ఫర్వీన్‌భాను కాలుకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనా యాదవ్, తదితరులు ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు.

సాంకేతికతను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి

కలెక్టర్ ఓ.ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వ్యవసాయ అనుబంధ రంగాల్లో పథకాలు, కార్యక్రమాలను ఎలా అమలు చేయాలనే విషయమై సాంకేతికతను అందిపుచ్చుకుని క్షేత్రస్థాయిలో రైతుల వద్దకు తీసుకెళ్లాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు వ్యక్తిగతంగా ఆవిష్కరణలు తీసుకువచ్చేలా పని చేయాలన్నారు. రబీ 2025లో సాధారణ సాగు విస్తీర్ణం 1,07,261 హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు 43,348.2 హెక్టార్లలో పంటలు సాగు చేయగా, 39 శాతం పంటల సాగు జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 36,651 మెట్రిక్ టన్నుల యూరియా, డిఏపి, ఎరువులు అందుబాటులో ఉండగా, అందులో 8,726 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో వుందన్నారు. క్షేత్రస్థాయిలో ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు వివరాలను ఐఎఫ్ఎంఎస్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, మార్క్‌ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, ప్రకృతి వ్యవసాయం డిపిఎం లక్ష్మానాయక్, డిసిఒ అరుణకుమారి, ఆత్మా పీడీ పద్మలత, ఎల్‌డిఎం నరేష్‌రెడ్డి, నాబార్డు ఎజిఎం అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

అమృత్ పనులను వేగవంతం చేయండి : కలెక్టర్

అమత్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజనీరింగ్ సెక్టార్ పై పబ్లిక్ హెల్త్, నగరపాలక సంస్థ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ పరిధిలో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా గుత్తి, గుంతకల్లు పట్టణాల్లో జరుగుతున్న పనులను వేగంగా చేపట్టాలన్నారు. అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం పట్టణ పరిధిలో పెండింగ్ ఉన్న లెగిసి వేస్ట్ పై దష్టి పెట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అమృత్.2 పనులు, ఎఐబి పనులకు సంబంధించి పెండింగ్ ఉండకుండా చేపట్టాలని, ఆయా పనుల్లో ప్రతివారం పురోగతి తీసుకురావాలన్నారు. మున్సిపాలిటీలలో నీటి, ఇతర పన్నుల వసూళ్లను చేయాలని, ఇందులో మరింత పురోగతి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఇఇ ఆదినారాయణ, మున్సిపల్ ఆర్‌డి నాగరాజు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావని, ఇఇ షాకీర్, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించడమే ధ్యేయంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే స్వయంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రజా సమస్యలను అధికారులు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు చాలా సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని విడతల వారీగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.శేషారెడ్డి, ఎంపిడిఒ భాస్కర్, ఐసిడిఎస్ సిడిపిఒ చల్లా లలితమ్మ, అగ్రికల్చర్ ఎఒ అన్వేష్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇఒఆర్‌డి విజయ్‌కుమార్, ఎపిఒ భాగ్యలక్ష్మి, హౌసింగ్ ఎఇ శ్రీనివాసులు, వీఆర్వో తాతయ్య, పంచాయతీ కార్యదర్శి తిప్పేస్వామి, సింగిల్ విండో ఛైర్మన్ గుర్రం లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, శాలిని దొర, గుత్తా ఆదినారాయణ,గోరంట్ల మారుతీనాయుడు, అట్టే రామాంజనేయులు, శింగనమల చెరువు ప్రెసిడెంట్ గార్లదిన్నె సత్యనారాయణ, ఎం.ఆదినారాయణ, కాయల రమణయాదవ్, డీలర్ కాయగూరల సత్యనారాయణ, మాసూల చంద్రమోహన్, సి.వెంకటేష్, ఉల్లికలు రంగారెడ్డి, రహంతుల్లా, దండు విజయ్‌కుమార్, తరిమెల పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

అనంతపురం కలెక్టరేట్ : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ (పిపిపి) విధానాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ వైసిపి మేథావుల విభాగం ఆధ్వర్యంలో గురువారం అనంతపురం-బళ్లారి బైపాస్‌లో ఎంజి పెట్రోల్ బంక్ వద్ద కోటి సంతకాల సేకరణ చేపట్టారు. సంతకాల సేకరణకు విశ్రాంత ప్రిన్సిపాళ్లు రంగస్వామి, జనార్దన్ రెడ్డి, మాధవరెడ్డి, మహాదేవరెడ్డి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మేథావుల విభాగం రాష్ట్ర కార్యదర్శి కట్టుబడి తానీషా, రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరయ్య, దాసిరెడ్డి, సూర్య, రాధాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

గుమ్మఘట్ట : మండల పరిధిలోని రేషన్ డీలర్లు తూకాల్లో మోసాలు చేయకుండా రేషన్ పంపిణీ చేయాలని తహశీల్దార్ రజాక్‌వలి సూచించారు. గురువారం మండల పరిధిలోని 44 ఎఫ్‌పి షాప్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ డీలర్లు అందరూ సకాలంలో డీడీలు చెల్లించాలన్నారు. కొంతమంది డీలర్లు తూకంతో కాక కొలతలతో బియ్య వేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. కావున డీలర్లు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని సూచించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

అనంతపురం : జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు గురువారం నగరంలోని ఇంటర్నల్ స్క్వాడ్ ఎరువుల దుకాణాలను గుత్తి వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాముడు, అనంతపురం మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకటాకుమార్‌తో పరిశీలించారు. ఇందులో భాగంగా రుద్రంపేటలోని న్యూ శ్రీనివాస ఫర్టిలైజర్స్‌లో రాయల్ ఆగ్రో లైఫ్ సైన్స్ కంపెనీకి చెందిన హై-జింక్ 1.2 మెట్రిక్ టన్నులు, విలువ రూ.97,272, గుత్తి రోడ్డులోని మా గోడౌన్‌లో ఉన్న ఫార్మా మాట్రిస్ కంపెనీకి చెందిన ఫోర్ యస్ ఎరువు 220 లీ, విలువ 2,08,000 ఫారం ఓలు లైసెన్స్‌లో లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న రామకృష్ణ

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని చెరువు కట్టపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సాకే రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో ఉన్న అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదానం చేయడం తమ కర్తవ్యమన్నారు. ఆలయంలో రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఉచితంగా దాదాపు 300 నుంచి 400 మంది వరకూ అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. మాల ధరించిన భక్తులు తప్పనిసరిగా వచ్చి స్వామివారి ప్రసాదము స్వీకరించాలని కోరారు.

పుస్తకాలు చదవడంతోనే విజ్ఞానం

గ్రంథాలయ ముగింపు వారోత్సవాల్లో వక్తలు



బుక్కరాయసముద్రంలో బహుమతులు పొందిన విద్యార్థులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

విద్యార్థులు తరచూ గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలు చదివితే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ సూచించారు. ఈనెల 14వతేదీ నుంచి ప్రారంభమైన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పున్నం విజయభాస్కర్ అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పి.రమ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా గ్రంథాలయాలను సందర్శించి అందులో ఉన్న విజ్ఞాన ఘనిని వినియోగించుకుని తమ మేథస్సును పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ పి.ఆనంద్‌చౌదరి, విశ్రాంత ఉపాధ్యాయులు పెద్దన్న, విశ్రాంత గ్రంథాలయ అధికారి సత్యనారాయణ, టీచర్లు సుబ్బరాయుడు, రాజేష్, నాగరాజు, అశ్వత్‌నారాయణ, ఆంజనేయులు, నాగరాజు, పరమేశప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : విద్యార్థులు తరచూ గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలు చదివితే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని మండల విద్యాధికారి బి.రవినాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ఇందులో భాగంగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి హెచ్.రామాంజనేయులు, అధ్యాపకుడు టి.గోవిందరాజులు, ఉపాధ్యాయురాలు ప్రేమావతమ్మ, సామాజిక కార్యకర్త సలీం, చెట్నేపల్లి గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేష్, సిబ్బంది సిద్ధార్థ్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వ్యాసరచన, చిత్రలేఖనం, రన్నింగ్ రేస్, మ్యూజికల్ ఛైర్స్‌గేమ్స్‌లలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయధికారి జి.కృష్ణ, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.నారాయణరెడ్డి, ప్రమీళ, మల్లికార్జునరెడ్డి, టీచర్లు నాగేశ్వరరెడ్డి,

యాడికి : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో జాతీయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి మధుసూదన అధ్యక్షతన గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది సూర్యనారాయణ, ఉపాధ్యాయులు కొత్త రాయుడు, వనజ, ముని, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి జి. నల్లమ్మ, కస్తూరిబా ఒకేషనల్ ఇన్స్‌పెక్టర్ జి.అనిత, టీచర్ బసిలింగమ్మ, వాణీ స్కూల్ టీచర్ జి.నాగవేణి, గ్రంథాలయ స్టాఫ్ సరళ, వన్నూర్‌సాబ్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధిశాఖ అధికారి నారపరెడ్డి, ఉపాధ్యాయులు రవికుమార్, ఇందిర, సుధామణి, కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, పాఠకులు ఇంద్రసేనారెడ్డి, కొనారెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆరు రోజులుగా జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం 7వ రోజు ముగిశాయి. ఇందులో భాగంగా వివిధ సాంస్కృతిక వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి, గ్రంథాలయ అధికారిని సుజాత, రికార్డు అసిస్టెంట్లు హేమలత, ఆదిలక్ష్మి, మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యల్లనూరు : స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, లైబ్రేరియన్ జయరాములు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా వివిధ పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు, ఎంఇఒలు రాముడు, గురుప్రసాద్, మైండ్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు గౌసియాబేగం, డ్రిల్ మాస్టర్లు రామచంద్ర, లింగరాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నారాయణస్వామి, ఈశ్వరప్ప, విశ్రాంత ప్రిన్సిపాల్ శేషం రాజు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ఇందులో భాగంగా వివిధ పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటలక్ష్మి, టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు విశ్వనాథ్, ఉపాధ్యాయులు సోమశేఖర్, అనురాధ, సురేష్, గాది లింగప్ప, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీపతి, టీచర్ నాగార్జునరెడ్డి, గ్రంథాలయ అధికారులు ప్రతాపరెడ్డి, పురుషోత్తం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారుల నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి కథనానికి స్పందన



పూర్తి చేసిన సిసి రహదారి

ప్రజాశక్తి-గుత్తి

ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి రైల్వే ఇంజనీరింగ్ అధికారులు స్పందించారు. గుత్తి ఆర్ఎస్ రైల్వే కాలనీలో సీసీ రోడ్డును ఒకవైపు వేసి మరోవైపు వదిలేశారు. దీంతో అక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 10న ప్రజాశక్తి దినపత్రికలో మున్సిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్ రైల్వేకాలనీలో సీసీ రహదారుల నిర్మాణం అస్తవ్యస్తం అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన రైల్వే ఇంజినీరింగ్ అధికారులు గుత్తేదారులపై ఒత్తిడి తెచ్చి అసంపూర్ణంగా ఉన్న సీసీ రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేయించారు. దీంతో రైల్వే ఉద్యోగులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముచ్చుకోట రిజర్వాయర్ పరిశీలన

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని ముచ్చుకోట గ్రామ సమీపంలో ఉన్న రిజర్వాయర్‌ను ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా పిఎబిఆర్ నుంచి వస్తున్న నీటి ఫ్లో గురించి అధికారులతో చర్చించారు. ఇచ్చిన మాట ప్రకారం ముచ్చుకోట రిజర్వాయర్‌ను నింపుతామని తెలిపారు. అనంతరం పుట్లూరు మండలం, కొండాపురంలోని తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు వెళ్లే షెట్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లోకనాథ్‌రెడ్డి, యువ నాయకులు హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు

పెద్దవడుగూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో పెద్దవడుగూరు మండలం వీరన్నపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లావణ్య, 8వ తరగతి భరత్, కార్తీక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

22న క్లస్టర్స్ కాంప్లెక్స్ సమావేశం

అనంతపురం సిటీ : ఈనెల 22న క్లస్టర్స్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నట్లు డిఇఒ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల సహాయకులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు విధిగా సమావేశానికి హాజరు కావాలన్నారు.

శ్రీచైతన్యలో 'ఫిట్ ఇండియా'

అనంతపురం : శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎటిపి-8 బ్రాంచులో గురువారం ఫిట్ ఇండియా మూమెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎజిఎం సుబ్బారెడ్డి విద్యార్థులకు ఆరోగ్య ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నేత్రావతి, కోఆర్డినేటర్ నాగభూషణం, డీన్ సుప్రజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం

అనంతపురం : నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న సెయింట్ ఆన్స్ పాఠశాలలో గురువారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 2024-25 పబ్లిక్ పరీక్షల్లో తెలుగులో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ సిస్టర్ సెల్వా మేరీ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు, పతకాలు, పుస్తకాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు తాడిపత్రి వెంకటరెడ్డి, కళాభూషణ్ అంకే రామలింగమయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ అసెంబ్లీకి హైస్కూల్ విద్యార్థి

యాడికి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అనిల్‌కుమార్ మోడల్ అసెంబ్లీకి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు సీతారామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యార్థి ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్వహించనున మోడల్ అసెంబ్లీలో పాల్గొననున్నాడు.

అండర్-14 వాలీబాల్ పోటీలకు నార్పల విద్యార్థిని

నార్పల : స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని ఆఫ్రీన్ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ అండర్-14 వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఆఫ్రీన్ నెల్లూరులో డిసెంబర్ 6, 7, 8వతేదీల్లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన ఆఫ్రిన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

వాహనాల తనిఖీ

యల్లనూరు : స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల సమీపంలోని కృష్ణాపురం మలుపు వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి రికార్డులు, హెల్మెట్ లేని వారికి అపరాధ రుసుం విధించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, జమేదారు వెంకటేష్, పోలీసులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

దున్నపోతు దాడి.. వ్యక్తి మృతి



మృతిచెందిన మహేష్

గుమ్మఘట్ట : మండల పరిధిలో సిరిగేదొడ్డి వద్ద మారెమ్మ దున్నపోతు బైక్ మీద వస్తున్న నాయకుల మహేష్ (40)పై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రాయదుర్గంలో నివాసం ఉంటున్న నాయకుల మహేష్ ప్రయివేటు బస్సు కండక్టర్‌గా పని చేసేవాడు. ఈనేపథ్యంలో కరుసురయ్యదొడ్డిలో ఉన్న బంధువుల వద్దకు బుధవారం రాత్రి తిరిగి వస్తుండగా సిరిగేదొడ్డి వద్దకురాగాజే దేవర దున్నపోతు ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో తలకు బలమైన గాయమై ఒక్కసారిగా పడిపోయాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రఘు తెలిపారు.

ఎద్దును ఢీకొని యువకుడు మృతి

రాయదుర్గం : బైక్‌పై వెళ్తూ ఎద్దును ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి రాయ దుర్గం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన మహేష్(22) మరో ఇద్దరు యువకులతో కలిసి బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై గుమ్మగట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామం నుంచి వస్తూ మొలకల్మూరు రోడ్డు చెక్ పోస్ట్ సమీపంలో ఓ ఎద్దును ఢీకొనడంతో కింద పడ్డారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా మహేష్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట జూదరులు అరెస్టు

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు తాడిపత్రి రూరల్ అప్‌గ్రేడ్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో దాడి చేసి పేకాట ఆడుతున్న శీలం సుంకన్న, కావేటి సంజీవులు, దేవగిరి మనోహర్‌రెడ్డి, సంపంగి సుంకన్న, కుమ్మెత్త ఆదినారాయణరెడ్డిను అరెస్టు చేసి రూ.76,110 నగదు, ఒక మోటార్ సైకిల్, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందులు సీజ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

విజిలెన్స్ అధికారులు తాడిపత్రి ఎడిఎ రవి, స్థానిక ఎడిఎ యల్లప్ప, ఏఓ జగదీష్ గురువారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. శ్రీలక్ష్మీవెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణంలో గడువు ముగిసిన వివిధ కంపెనీలకు చెందిన రూ. 15.24 లక్షల విలువ చేసే 6.75 మెట్రిక్ టన్నుల ఎరువులను గుర్తించి సీజ్ చేశారు. మనోగ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేసి అక్కడ వివిధ కంపెనీలకు చెందిన రూ. 3.30 లక్షల విలువ చేసే 465 లీటర్ల క్రిమిసంహారక మందులను జప్తు చేశారు. రైతులు మోసపోకూడదనే ఈ తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా రైతులకు అన్యాయం జరిగితే నేరుగా ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ తరగతులను గురువారం ఎంఇఒ మల్లికార్జున ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో గ్రేడింగ్ విధానం అమలు చేయడంలో ప్రధానోపాధ్యాయులు తీసుకోవాల్సిన చర్యలపై ఈ శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే విద్యార్థుల ప్రతిభను గుర్తించడం, బోధన విధానం, పరిసరాల పరిశుభ్రత, ఆటల పోటీలు, విద్యార్థుల హాజరు, తదితర అంశాలపై మూల్యాంకనం చేసి ఆ విద్యార్థికి ఆ పాఠశాలకు గ్రేడింగ్ విధానం అమలు చేయాలన్నారు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం సమీపంలో ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి) ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం గురువారం కూడా కొనసాగింది. స్థానిక కళాశాల ప్రాంగణంలో స్మార్ట్ విజన్ ఆసుపత్రి సహకారంతో, ఐఆర్‌సిఎస్, రోటరాక్ట్ క్లబ్, మహిళా సాధికారత సంఘం కలిసి ఈనెల 17వ తేదీ నుంచి కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు, సిబ్బందికి కంటి పరీక్షలు చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కె.తమ్మీన్ షాజియా, ప్రిన్సిపాల్ జి.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ యు.శ్రీనివాస్, హెచ్అండ్ఎస్ హెచ్ఒడి జె.గురుసిద్దప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు సి.లక్ష్మీ నారాయణ, వై.మధుసూదన, టి.అరవింద్‌బాబు, ఎం.సుజాత, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి - గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన టిడిపి మండల మాజీ కన్వీనర్ రామచంద్రయాదవ్ సతీమణి, టిడిపి కార్యకర్త గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల ఇన్చార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఆమె నివాసానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, గుత్తి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనా యాదవ్, ఎంపిటిసి జింకల నారాయణస్వామి, టిడిపి మండల కన్వీనర్ బి.లక్ష్మీరంగయ్యయాదవ్, నాయకులు బి.చిన్నారెడ్డి యాదవ్, డేగ మద్దిలేటి, రంగారెడ్డి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నా భర్త ఆచూకీ తెలియజేయండి

మీడియా ఎదుట వాపోయిన బాధితురాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తన భర్త శ్రీరాములను కిడ్నాప్ చేశారని, ఎస్పీ స్పందించి తనకు న్యాయం చేయాలంటూ నగరంలోని కోవూర్‌నగర్‌కు చెందిన పుష్ప శ్రీరాములు ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం నగరంలోని ఎపి ఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనంతపురంలోని కొవూర్‌నగర్‌కు చెందిన తాము కొన్నేళ్లుగా బెంగళూరులో స్థిరపడ్డామన్నారు. అయితే కల్పవృక్ష డెవప్‌మెంట్ ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేసి, వివిధ ప్రాజెక్టుల ద్వారా వచ్చిన లాభాలలో తమ సంస్థలో పెట్టుబడులు పెట్టిన వారికి వచ్చిన లాభాల్లో సగం వాటా.. ఇస్తూ వచ్చామన్నారు. ఇలా తిరుమలేష్, ప్రియాంక, శారద, ఉమా, మరికొంత మందితో కలిసి తమకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వలేదంటూ తప్పుడు ఆరోపణలు చేశారని వాపోయారు. తాము వారికి చెల్లించిన డబ్బును రికార్డులతో సహా తమతో ఉన్నాయన్నారు. వారికి చెల్లించిన ప్రతి రూపాయి బ్యాంకు ద్వారానే చెల్లించామన్నారు. కేవలం రూ.15లక్షలు ఇవ్వాల్సి ఉండగా రూ.కోట్లు ఇవ్వాలంటూ నిత్యం ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. దీనిపై కర్నాటకలోనూ కేసులు నమోదు చేశారని, వారికి ఇవ్వాల్సిన డబ్బు ఇస్తామన్న తన భర్త శ్రీరాములను బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. రెండు రోజుల క్రితం అనంతపురంలోని కోవూరు నగర్‌లో ఉన్న ఇంటికి కొంత మంది వచ్చి తన భర్త శ్రీరాములను



విలేకరులతో మాట్లాడుతున్న బాధితురాలు

కిడ్నాప్ చేసి బలవంతంగా తీసుకెళ్లారని తెలిపారు. ఇప్పటి వరకు తన భర్త ఆచూకీ తెలియటం లేదన్నారు. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తానన్నారు. కావున ఎస్పీ తనకు న్యాయం చేయాలని కోరారు. అలాగే తమపై తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై పరువు నష్టం కింద కేసు నమోదు చేస్తానని హెచ్చరించారు.

కుల గణన చేపట్టాలని వినతి

ఆత్మకూరు : జనగణలో కులగణన కూడా చేపట్టాలని సిపిఐ నాయకులు కోరారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి శివ, మహిళా సంఘం సరస్వతమ్మ, కృష్ణమూర్తి, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

శింగనమల : మండల పరిధిలోని పెద్దజలాలపురం గ్రామానికి చెందిన మంచాల గిరిస్వామి కుటుంబానికి మంజూరైన చంద్రన్న బీమా చెక్కును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సింగిల్‌విండో ప్రెసిడెంట్ గుర్రం లక్ష్మీనారాయణ, డేగల కృష్ణమూర్తి, మారుతీనాయుడు, రంగారెడ్డి, చితంబరి దొర, శాలిని, ఎన్.ఆదినారాయణ, చలమయ్య, చంద్రశేఖర్, రామాంజనేయులు, డి.ఓబులమ్మ, ఎం.ఓబులమ్మ, ఎం.మాదెమ్మ, తదితరులు పాల్గొన్నారు

రోడ్ల పనుల పూర్తికి సహకరించండి

కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వివిధ జాతీయ రహదారి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కారీని కోరారు. శ్రీసత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు కేంద్ర జాతీయ రహదారులు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి గురువారం పుట్టపర్తికి విచ్చేశారు. పుట్టపర్తి విమానాశ్రయంలో జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. విమానాశ్రయంలో పుట్టపర్తి రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, సవితమ్మ, సత్యకుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, బిజెపి నేత సోమగుట్ట విష్ణువర్ధన్ రెడ్డి, కలెక్టర్



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు

శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, ట్రస్ట్ సభ్యులు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుంచి నితిన్‌గడ్కారీ ప్రశాంతి నిలయం చేరుకుని సాయి కుల్వంత హాల్లో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. బాబా దర్శనం అనంతరం శ్రీనివాస గెస్ట్‌హౌస్‌లో సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల ప్రగతిపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర మంత్రులు, ఆర్అండ్‌బి అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. సత్యసాయి జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు నూతన జాతీయ రహదారుల ఏర్పాటుపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్.రాజులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పుట్టపర్తితో పాటు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. పెనుగొండ జాతీయ రహదారి 44 నుంచి కొత్తచెరువు, పుట్టపర్తి, నల్లమాడ, ఓడి చెరువు మహమ్మదాబాద్ క్రాస్, సిఇ.ప్రాజెక్టు కొక్కంటి క్రాస్ వరకు కదిరి టు చెన్నై జాతీయ రహదారికి కలపాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలో నూతన ఆర్అండ్‌బి రోడ్లు, పాడైన బీటీ రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టే విధంగా నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ రాష్ట్ర డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, సామకోటి ఆదినారాయణ, టిడిపి నాయకులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, గంగాధర్ నాయుడు, సురేష్ చౌదరి, బీసీ గంగన్న పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



రాయదుర్గంలో గ్రంథాలయ వారోత్సవాలు



బ్రహ్మసముద్రంలో గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. చివరి రోజైన గురువారం గుమ్మగట్ట లోని శాఖా గ్రంథాలయంలో వివిధ పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథా లయ అధికారి నాగరాజు వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి పాఠశాల హెచ్ఎం యోగేశ్వర్, ఉపాధ్యాయులు జ్యోతి, రేవతి, బాషా, రవి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

డి.హీరేహాళ్ : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేత విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి ఉషారాణి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా జ్యోతిబాపూలే పాఠశాల హెచ్ఎం షాహిదాబేగం, శోభ, జయలక్ష్మి, వాణిశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులు సమయం వృథా చేయకుండా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, దినపత్రికలు చదివి జ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : స్థానిక గ్రంథాలయంలో అధికారి బాబాప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాల య వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపిపి స్కూల్‌లో బాల, బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఇఒ మల్లికార్జున బహుమతులు అందజేశారు. ఎంఇఒ మాట్లాడుతూ గ్రంథాలయం దేవాలయం లాంటిదని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూ చించారు. కార్యక్రమంలో హెచ్ఎం సాయిలీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు

బ్రహ్మసముద్రం : స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు అధికారి ఎర్రిస్వామి పేర్కొన్నారు. జడ్పీ హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్ఎం హను మంతరెడ్డి అధ్యక్షతన ముగింపు కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ గ్రంథాలయం వెళ్లి తలవంచి పుస్తకాన్ని చదివితే నిన్ను తలెత్తుకునేలా చేస్తుందని విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి మాట్లాడుతూ సభ్యత్వం పొంది పుస్తకాలు చదవాలని సూచించారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనుంజయరెడ్డి, వెంకటనారాయణ, విశ్వనాథ, గ్రంథాలయ సిబ్బంది బసవరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.